రజతోత్సవం

తెల్లవారుఝామున నాలుగవుతుందేమో—సాకేతరామ్‌కు మెలకువ వచ్చింది. కొంతసేపు పక్కమీద అటూ ఇటూ దొర్లాడు. మంచం చివరకు జరిగి దగ్గరగా టీపాయిమీద ఉన్న అగ్గిపెట్టె అందుకొని సిగరెట్ వెలిగించాడు. బెడ్‌రూమ్ లైటు వెలుగులో తను ఊదిన పొగ రింగురింగులుగ పైకి వెళ్ళి గాలిలో కలిసి పోతోంది. ఆ వెలుగులో అతడు తన చేతికున్న రేడియమ్ డయల్ వాచి చూసుకున్నాడు.

అరగంటే గడిచింది. అంటే నాలుగున్నరయిందన్నమాట.

"ఇప్పుడేం తొందరొచ్చిందిలే—ఐదింటికి లేవచ్చు" అనుకుని మళ్లీ కన్ను మూయాలని ప్రయత్నించాడు. నిద్రపట్టలేదు. కాని—అతడు లేవదలచుకోలేదు.

బెడ్‌రూమ్ లైటు వెలుగులో పక్కకు తిరిగి చూశాడు. యశోద తలకింద చెయ్యిపెట్టుకుని అటుపక్కకు తిరిగి పడుకుని నిద్రపోతున్నది. "ఇవాళ ఇంకా ఇలా నిద్రపోతోందేం?" అనుకున్నాడు.

రెండురోజుల కిందట తన గదిలో లైబ్రరీ అంతా సర్దుకుని, అట్టలు చిరిగిన పుస్తకాలు తీసి విడిగా పెట్టుకున్నాడు—వాటిని మంచి బైండర్‌కిచ్చి బైండ్ చేయించి బీరువాలో పెట్టాలని. సాకేతరామ్ నెలనెలకు పప్పు ఉప్పు సామాను కొన్నట్టుగా ఎంత ఇబ్బంది వచ్చినా ఒక మంచి పుస్తకం కొని తన పేరు రాసుకుని బీరువాలో పెట్టుకుంటాడు. అలా ఎప్పుడుకొన్న పుస్తకమో అది—అట్టలు ఊడిపోయి కాగితాలు జారిపొయ్యాయి. ఫైల్సు బల్లమీద పడేసి, ఆ ఊడిపోయిన రెండు కాగితాలు కుతూహలంతో చదివాడు. ఆ రెండూ చదివిన తరువాత, వాటి తాలూకు మిగిలిన కాగితాలు వెతికి చివరకు చదివాడు.

అదొక చిన్న కథ. జర్మనీ దేశంలోని ఒక పల్లెటూరి రైతు కథ. 65-70 సంవత్సరాల దంపతులు. వాళ్ళిద్దరూ ఒకరినొకరు విడిచి ఉండలేరు. ఇద్దరూ ఒక్కసారే టీ తాగుతారు. ఒకసారే భోజనం చేస్తారు. ఎడతెగని కబుర్లు చెప్పు కుంటూ సాయంత్రపు వేళల్లో తోటల్లో తిరుగుతూ పనిచేస్తారు ఒకరికి తలనొప్పి వస్తే మరొకరు సహించలేరు. ఇంటిపనులు ఇద్దరూ కలిసి చేసుకుంటారు. ఒకరు పేపరు చదివితే ఇంకోరు వింటారు మాటవరసకయినా తగవులాడుకోరు.

ఇంకా కథ ఇలా సాగిపోతున్నది. సాకేతరామ్ అక్కడితో ఆ కాగితాలు బైండు చేయాల్సిన పుస్తకాలలో పెట్టి, కుర్చీకి తల ఆనించి ఆలోచనలో పడ్డాడు. 65-70 సంవత్సరాల దంపతులు ఇంకా అలా ఒకరికొకరు అంటి పెట్టుకుని ఉంటారా? దంపతులకు పరస్పరాకర్షణలోనుంచి పుట్టినదే కదా ప్రేమ? స్త్రీ పురుషుల పరస్పరాకర్షణ అంటే శారీరకమైన వాంఛాజనితమేకదా! ఇంకా వాళ్ళిద్దరి మధ్య ఇటువంటి ఆకర్షణ ఉందని కథకుడు చెప్పబోతున్నాడా?

ఆ కాగితాలు మళ్ళీ చదివాడు. మొదట పరస్పరాకర్షణ-దానిలోనుంచి ప్రేమ - ఈ రెండింటికి తోడు స్నేహం కూడా ఉండాలని నిరూపిస్తున్నాడు రచయిత. జీవితంలో ఆకర్షణ వయసుకు సంబంధించింది; దానివల్ల జనించిన ప్రేమ కూడా అంతే. వయసు పెరిగిన కొద్దీ ఆకర్షణ తగ్గవచ్చు. ప్రేమకూడా అంత గాఢంగా ఉండకపోవచ్చు. కాని స్నేహంకూడా వీటితోపాటు వృద్ధి అయితే ప్రేమ జీవితమంతా నిలుస్తుంది. ఇద్దరూ శారీరకమైన సంబంధం లేకపోయినా స్నేహంతో ప్రేమగా తోడూనీడగా బ్రతుకుతారు. అది విడదీయరాని బంధమవుతుంది. ఇదీ రచయిత ఆ కథలో చెప్పింది.

ఇది నిజమా? అందరిపట్ల ఇది సాధ్యమా!

మళ్లీ అతడి దృష్టి యశోదమీదికి మళ్ళింది.

పదిహేనేళ్ళ పిల్లప్పుడు తను చదువుకుంటుండగా యశోద తమ ఇంట పాదంపెట్టింది. తన చదువు పూర్తి అయింది. ఉద్యోగంలో క్రమంగా డెప్యూటీ సెక్రటరీ రాంకుకు వచ్చాడు. సరిగ్గా పెళ్ళయి నిన్నటికి పాతిక సంవత్సరాలయింది. ఎందుకో అతడిని-నాలుగు రోజులనాడు ఒక పార్టీకి వెళ్ళినప్పుడు అక్కడ కనిపించిన చీరె ఆకర్షించింది. యశోదకు అలాంటి చీరె కొనాలనిపించింది.

ఇంతకాలమయింది-యశోదకు తన చేతిమీదుగా ఒక చీరయినా కొనలేదని పించింది. ఎందుకో అతడికామాటే తోచలేదు. ఆఫీసునుంచి వస్తూ బనారస్‌చీరెల షాపుకు వెళ్ళాడు. చీరెలు తీయించాడు. అన్ని రంగుల్లో అన్నిధరల్లో చూపించిన చీరెలు చూశాడు. ఇంకా తీయిస్తున్నాడు చూస్తున్నాడు.

ఏమి రంగు నప్పుతుంది యశోదకు?

ఆలోచిస్తున్నాడు.

ఎంతకు తెగదు ఆలోచన.

సహనంతో అతడు అడిగినకొద్దీ చీరెలు తీసి చూపిస్తున్నాడు వర్తకుడు.

"అమ్మగారు ఏ రంగులో ఉంటారు?" అడిగాడు తనేదయినా సలహా యిద్దామని.

"రంగా? యశోద ఏ రంగులో ఉంటుంది?" అతడి మనసులో ప్రశ్న బయలుదేరింది. ఇరవై ఏళ్ళకే నలుగురు బిడ్డల్నికన్న యశోద-పొయ్యి దగ్గర మగ్గిమగ్గి పదిమందిగల సమష్టి కుటుంబానికి వండి వడ్డించిన యశోద-ఎడనక వాన నక వచ్చిపోయేవారికి నడుము వంగేటట్లు అతిథి మర్యాదలు చేసిన యశోద ఇప్పుడే రంగులో ఉంది?

అతడు మొదటి రాత్రే ఆమెను పరీక్షగా చూశాడు.

ఆ తరువాత?

ఆమె ముఖం సరిగ్గా చూడటానికే తీరికలేకపోయింది.

"నిజంగా తీరికలేకనేనా?" మనసు నిలదీసింది.

'ఆమె ముఖంలోకి చూసి ఎప్పుడయినా పలకరించావా? ఆమె నవ్వుతున్నప్పుడు ఆ ముఖం ఎలా ఉంటుందో చూశావా? ఆమెకు సన్నిహితుడిగా స్నేహితుడిగా ఎప్పుడయినా పలకరించావా?'

అతడిలో ఒణుకు సన్నగా ప్రారంభమయింది.

"ఏం అయ్యగారూ? ఏ రంగు? ఏ రకపుటంచు?" జ్ఞాపకం చేశాడు వర్తకుడు మళ్ళీ.

తల గోక్కున్నాడు సాకేతరామ్. ఇంత ఖర్చుపెట్టి, మోజుపడి, కొని యింటికిపోతే యశోద ఒంటి రంగు కది నప్పకపోతే ? అంతా వృథా-వృథా.

కళ్ళజోడు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకున్నాడు.

వర్తకుడికి సహనం చచ్చిపోతోంది. అయినా సాకేతరామ్ ముఖంలోకి నిదానంగా చూస్తున్నాడు.

"అయ్యగారూ ! ఏ రంగు కలవాళ్ళకయినా ఈ లేత నీలం రంగు మీద మెజంతారంగు గళ్ళు-ఈ జరీ చక్రాల అంచు చాలా బాగుంటుంది. ఐదు వందల ఏభయి రూపాయలు. మీకో పాతిక తగ్గించి ఇస్తాను, తీసుకెళ్ళండి. ఈ చీరె అమ్మగారికి తప్పకుండా నచ్చుతుంది" బలవంతంచేసి ప్యాక్ చేసి చేతిలో పెట్టాడు. ఇంటికి రాగానే తన మంచమ్మీద తలవైపుగా పక్కకింద పెట్టాడు మళ్ళీ దాని ధ్యాసలేదు అతడికి.

"కాఫీ తీసుకోండి" పొగలు గక్కే కాఫీ కప్పుతో యశోద నిలబడ్డది ఎదురుగా.

ఎప్పుడు లేచి వెళ్ళిందో యశోద ? ఆ రోజు శుక్రవారం కాబోలు. తలంటు కున్నట్టుంది. జారుముడి వేసుకుని నాగ మల్లెలు సుతారంగా ముడికి కుడివైపున రెండు పెట్టింది. దోసగింజ బొట్టు పెట్టుకుంది, ఐదున్నరకల్లా ముఖమ్మీద ముంగురులు సవరించుకుంటూ తనకు బెడ్ కాఫీకి వేళయిందని మేడమీదికి తీసుకువచ్చింది. తను నిద్రపోతున్నాడనుకుంది కాబోలు లేపింది.

ఆ లేపటం ఎట్లా లేపిందని ?

గడ్డం దగ్గర్నుంచి పెదవులూ ముక్కూ మీదుగా ఫాలభాగం వరకూ తర్జనితో తాకీతాకకుండా గీత గీసింది.

చటుక్కున కళ్ళు తెరిచాడు.

పాతికేళ్ళ సహధర్మచారిణి, నలుగురు పిల్లల తల్లి, సర్వకాల సర్వావస్థల లోనూ తన కళ్ళ ముందర మెదిలిన యశోదను 'దివి నుండి భువికి దిగి వచ్చిన దేవతవా నీవు ? ఎవరు నీవు ? ఇంత ప్రశాంతతను ఈ గదిలోకి తీసుకువచ్చావు. నీ సౌందర్యంతో ఈ గదంతా వెలుగులు చిమ్ముతున్నాయి'.

ఈ మాటలు అనాలని అతడి నోటి వరకూ వచ్చాయి. కాని అవి అతడి పెదవి దాటలేకపోయాయి.

అయినా వాటి ప్రభావం ఎక్కడికి పోతుంది.

ముఖం ప్రఫుల్లమయింది.

పట్టలేని ఆవేశంతో పొగలుగక్కే కాఫీ కప్పు నందుకొని టీపాయి మీద పెట్టాడు.

అతడికి ఆమెతో ఏదేదో చెప్పాలని గుండెను విప్పి ఆమె ఎదుట పరచాలని ఆరాటంగా ఉంది.

'శుక్రవారం ఉషస్సులో తలలో పూలు ముడుచుకుని వచ్చావు. నీవు తెచ్చిన బెడ్ కాఫీ నేనొక్కడినే ఎట్లా తాగుతాను? ఫిఫ్టీ ఫిఫ్టీ' అని పక్కనున్న గ్లాసులోకి. ఆమెకు తన కప్పులో కాఫీ ఒంపాలన్న ఉబలాటం, అంతేకాదు తన చేతులతో తాగించాలని కూడా, కానీ అలాంటివేవీ జరగలేదు.

''నీవు కూడా తీసుకో.'' అన్నాడు బలవంతంగా వచ్చినట్టున్న దామాట.

''నా కాఫీ కింద ఉన్నది. కిందికి వెళ్తాలెండి।'' అంది యశోద-ఆ చిన్న ఆ ఒక్కమాటకే ఆశ్చర్యపోతూ.

''కాదు. నీవిక్కడే కాఫీ తాగాలి—నా ముందరే.'' ఈ మాట ఎట్లా అన్నాడో అతడికే తెలియదు.

''ఎట్లా మరి? అయితే కిందికి వెళ్ళి తెచ్చుకుంటానుండండి. ఈ లోపల మీరు తీసుకోండి. చల్లారిపోతుంది.''

''అలా కాదు. ఈ కాఫీ ఇద్దరం పంచుకుందాం.'' ఆమెకు చిన్న గ్లాసులో పోసి చేతికిచ్చాడు.

ఇటువంటి సరాగాలన్నీ యశోదకు తెలియవు అని అనుకోవటానికి వీలు లేదు. కాని-అనుభవంలో లేవు కనుక బిత్తరపోయి యిస్తోంది.

తరువాత బెట్టు కొంత తగ్గింది. ''నీకేం తెచ్చానో చెప్పుకో?'' అంటూ తల వైపున దిండు కింద ఉన్న ప్యాకెట్టు తీసి ఆమెచేతి కిచ్చాడు.

ఆమె నవ్వుతూ ప్యాకెట్ చేతిలోకి తీసుకుని విప్పి చూసి సంభ్రమంతో "ఎంత బాగుందీ చీరె? నాకు ఇటువంటి చీరె కావాలని మీ కెట్లా తోచింది?" వంటి మాటలు అని, చీరె మడత విప్పి కొంగు భుజమ్మీద వేసుకొని, రెండడుగులు నడిచి చూసి, పరుగెత్తుకొని వెళ్ళి, కట్టుకుని మురిపిస్తూ వస్తుందనుకున్నాడు.

కాని ఆ ప్యాకెట్టు చేతబట్టుకుని అతడి ముఖంలోకి చూస్తోంది యశోద.

"యశోదా! ఇంతకాలానికి నీ కో చీరె కొన్నాను.కట్టుకుని చూపించవూ?" అతడి కళ్ళలో అభ్యర్థనలాంటి భావం మెరిసింది.

యశోద నిలబడిపోయింది. పొద్దున్నే బోలెడు పని తనకోసం ఎదురు చూస్తోంది. ఇప్పుడీ చీరె ఏమిటి? కట్టుకుని వచ్చి తనకు చూపటమేమిటి? చిన్న పిల్లల చేష్టలు. ఎవరు విన్నా నవ్విపోతారు.

"యశూ, ప్లీజ్ కట్టుకురా."

"యశూ! ఆ పిలుపేమిటి? తన గుండెలో అదింత సంచలనం కలిగించట మేమిటి?"

ఆమె అతడిని కొత్త పెళ్ళి కొడుకును చూసినట్టు చూస్తోంది

అతడి కళ్ళు మామూలుగా లేవు. ఆ చూపులను తనెప్పుడయినా చూపిందా? సమ్మోహనాస్త్రతుల్యంగా ఉండే? మంత్రముగ్ధను చేస్తున్నదేమిటి? మొదటి రోజయినా అట్లా చూశాడా?

ఆమెకూ అర్థంకావటం లేదీ కొత్త గొడవ.

అయినా ఆ చూపులను ఎదుర్కోలేక చీరె మడతలు విప్పి పక్క గదిలోకి వెళ్ళి, కట్టుకుని ఎదురుగా వచ్చి నిలబడ్డది బొమ్మలా.

ఆమె నతడు కళ్ళారా చూశాడు. అతడి చూపులు వింత వింతగా ఉన్నాయి. తన నెప్పుడూ చూడనట్టుగా సంభ్రమంతో అప్పుడే చూస్తున్నట్టుగా ఉన్నాయా చూపులు.

అతడి ఎదలో ఉత్తుంగతరంగాలు ఎగిసెగిసి పడుతూ నురుగులు గక్కుతూ ఒడ్డుకు పరుగులు తీస్తున్నాయి.

యశోద రంగు ఇదా?

యశోద లావెక్కలేదా?

సన్నగా రివటలా అట్లాగే ఉన్నదా?

ఆమెకు చీరె కట్టుకోవటంలో ఇంత నేర్పు ఉందా? ఎట్లా కట్టింది!

"యశూ" మంచమ్మీది నుంచి లేచి వచ్చాడు. తమి పట్టలేక ఆమెను గుండెకు హత్తుకున్నాడు.

ఆమె ఉక్కిరిబిక్కిరి అయి, నవోఢలా గదిలో నుంచి కిందికి పరుగులు తీసింది.

అతడు స్నానంచేసి డ్రెస్ చేసుకుని కిందికి దిగి వచ్చేసరికి, బల్లమీద కాఫీ, టిఫిన్ రెడీగా ఉంది. ఈగలు వాలకుండా నెట్ వాటిమీద పెట్టింది. వంటింట్లో పనిచేసుకుంటూ అతడికోసం ఎదురుచూస్తోంది యశోద.

తిన్నగా వంటయింట్లోకి వచ్చాడు సాకేతరామ్.

రెండురోజుల క్రిందట వర్షం పడినట్టుంది. భూమిని పగలగొట్టుకుని పచ్చికే బయటికి తొంగిచూస్తోంది. యింటి కిటికీలోంచి ఆమె ఆ వింత శోభనే తిలకిస్తోంది. నలభైఏళ్ళకీ పులకరింత ఏమిటి తనకూ? అతడు యశూ అనగానే నును సిగ్గుల పెళ్ళి కూతురైందేమిటి? తన బిడ్డలు పెద్దవాళ్ళై దూరాన ఉన్నారుగాని ఇంట్లోనే ఉంటే వాళ్ళేమనుకుంటారు? ఈయన ఇలా చిన్నపిల్లవాడై పోతున్నాడేమిటి? నవ్వుకుంది.

అతడామె భుజాలు పట్టుకుని తన వైపుకు తిప్పుకుంటూ "రెండో ప్లేటేది" అన్నాడు.

ఆ స్వరంలో ఏదో మధురమైన భావన-దానికి జవాబుగా ఆమె హృదయం స్పందిస్తోంది.

పదహారేళ్ళ కన్యలా సిగ్గుతో కళ్ళు దించుకుంటూ రెండవపళ్ళెం బల్లమీద పెట్టింది. అతడు ఆమెకు కాఫీ కప్పు మంచినీళ్ళు అమర్చాడు.

ఆమెను రమ్మని కళ్ళతో పిలుస్తున్నాడు. ఆమెకు ఏమిటోగా ఉంది. అతడు చెయ్యిపట్టుకుని లాగుతుంటే తాను సిగ్గుల పెళ్ళికూతురులా అతడి వెంట వెళ్ళింది.

"మాట్లాడకుండా తింటావేం? నోరులేదూ?" అన్నాడు కళ్ళు మరింత మరింత మెరిసేటట్టుగా చూస్తూ.

"ఏం మాట్లాడను? మీరు మాట్లాడండి." తల వంచుకుంది.

"ఇప్పుడు తలవంచుకుంటావేం? ఆ కాలం గడిచిపోయింది." ఆమెను ఓరగంట చూశాడు.

ఆమె పెదవులమీదికొక వింత నవ్వు జారింది. "గడచిపోయిందని తెలుసు. ఇప్పుడేం చెయ్యాలో తెలియటంలేదు" కళ్ళల్లో కొంటెతనం.

ఆ మాటలకు అతడి గుండెలో సన్నటి మంట బయలుదేరింది. తనలో తాను ఛీ ఛీ అనుకున్నాడు. ఇన్నేళ్లు తనెట్లా గడిపాడు? మనిషిగానేనా?

ఈ కొత్త ఉమ్మరంలోనుంచి బైటపడాలని ఆమె, "మీకు టైమవుతున్నది. కాఫీ చల్లారిపోతున్నది." తొందర చేసింది.

"యశూ, నేనివాళ సెలవుపెట్టాను. కిద్వాయ్ గార్డెన్స్‌లో కాటేజి బుక్ చేశాను. దారిలో టిఫిన్ కారియరు నింపించుకుని పెద్ద ఫ్లాస్కులో కాఫీ పోయించుకుని వెళ్దాము. నీవు ఈ చీరెతోటే బయలుదేరాలి. తొమ్మిదింటికి ప్రయాణం," అన్నాడు ఆమె భుజం తడుతూ.

ఆమె శరీరం జలదరించింది. ఇప్పుడీ ప్రోగ్రాం ఏమిటి? తీర్థయాత్రలు చేసే వయసులో; కాని - ఈ మాట పైకనలేక "మీ తోటి ఉద్యోగులు వాళ్ళ భార్యలతో వస్తున్నారా?" అంది. అంతటితో ఆపక "నే నింట్లో పనులు చూసుకుంటా లెండి." అంది.

"సరి సరి. నీవు రాకపోతే ఇదంతా ఎందుకు? ఇందంతా మనకోసం.... మనిద్దరికోసం" ఆమె గడ్డం నిమిరాడు.

యశోద ఐదునిమిషాలలో ఇల్లంతా సర్దింది. అతడు తాళాలు వేశాడు. ఇద్దరూ మారిస్ మైనర్‌లో బయలుదేరారు. ఆ కారు ఎంత పాతదో కాని ఆ

రోజున ఎక్కువ పేచీ పెట్టకుండా స్టార్టయింది. హోటల్‌మీదుగా కిద్వాయ్ గార్డెన్సుకు పరుగుతీసింది

"మీలాగే ఈ కారుకూడా కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. రోజులాగ లేదు" అంది యశోద

'ఏమిటనుకున్నావు మరి?' అన్నట్టు చూశాడు.

కారు ఆగగానే సామాను లోపలపెట్టి ఇద్దరూ తోట చూడటానికి బయలు దేరారు!

రంగు రంగుల పూలతోటలు, వాటిమధ్య గలగల పారే చిన్న పిల్లకాలవలూ. వాటి మధ్య సన్నటి సిమెంటు బ్రిడ్జిలాంటి కాలిబాటలూ - నీటిమీదినుంచి వీచే చల్లటి గాలి పలకరిస్తుంటే - ఆ చల్లటి వాతావరణంలో ఒళ్ళు పరవశిస్తుంటే- సీళ్ళల్లో ఇటూ అటూ చూస్తూ నడుస్తుంటే పడిపోతామేమోనన్న భయంతో ఒకరి చేతు లొకరు పట్టుకుంటూ వొయ్యారంగా తోటంతా నడిచారు ముసిముసి నవ్వులతో. గట్టుమీదికి వచ్చి చూస్తే కొండ కొనలలోనుండి ఉరవడితో వస్తున్నట్టుగా పైనుంచి నీటిధారలు హోరున చప్పుడుచేస్తూ కిందికి దూకి పిల్లకాలవలలోకి పరుగులు తీస్తున్నాయి.

చిన్నపిల్లల మాదిరిగా ఇద్దరికీ ఎంతో సంభ్రమం కలిగింది. ఎంతో ఆనందం. ....ఎంతో పరవశం.... పులకరింతలు- జలదరింపులు.

వాళ్ళిద్దరూ ఇంత సన్నిహితంగా ఈ పాతికేళ్ళ జీవితంలో మెలగలేదు. కొత్తదనం- బిడియం- జంకు మొదలైనవన్నీ ఒక్కొక్కటీ జారిపోతున్నాయి. తోటంతా నడిచారు.

తోటలో ఒకపక్క జనం గుమిగూడి ఉన్నారు. ఒకరినొకరు తోసుకుంటున్నారు. ఏదో పిక్చర్ షూటింగని చెప్పుకుంటున్నారు చూడాలాని జనం ఆత్రపడుతున్నారు.

అంతలో అక్కడికి ప్రేమికుల జంట వచ్చింది.

అక్కడ మూడు మెట్లున్నాయి. నాయకుడు వెనకనుంచి వస్తుంటే నాయకి అతడికి అందకుండా గబగబా మూడు మెట్లెక్కి పూలచెట్ల పక్కగా పరుగెత్తి

డాన్సు చెయ్యాలి. నాయకుడు ఆమెను అందుకోలేనట్టుగా స్పీడు తగ్గించి పరుగెత్తాలి. కొంతసేపయిన తరువాత నాయకి దొరికిపోతుంది. వాళ్ళిద్దరి నటనా సంభాషణలూ వినడంకోసం, వాళ్ళ సాన్నిహిత్యం చూడటం కోసం ప్రజలు విరగబడిపోతున్నారు.

ప్రేమికుల జంట ప్రేమ అసహజంగా వికారంగా ఉంది. ఇద్దరూ వాళ్ళను చూసి నవ్వుకున్నారు. అప్పటికి ఒంటిగంటయింది. ఇద్దరూ కాటేజిలోకి వచ్చారు. ఆమె లోపలికి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చేటంతలో అతడు కూజాలో నుంచి నీళ్ళు తీసుకుని చేతులు కడుక్కుని భోజనసామగ్రి అంతా పళ్ళేలు పెట్టి వడ్డించాడు. ఆమెకోసం ఎదురుచూస్తున్నాడు.

'ఇదేమిటి? ఈ పని కూడా వచ్చా మీకు?' అనుకుంటూ వచ్చి కూర్చుంది యశోద.

సిగ్గుపడిపోయాడు సాకేతరామ్- ఇంతవరకూ తను చేయించుకున్నందుకు.

అలాగ అతడు ప్రతిరోజూ ఏదో ఒక విషయంలో సిగ్గుపడిపోతూనే ఉన్నాడు. తల క్రుంగిపోతూనే ఉంది.

ఒకసారి సెలవుపెట్టి నాలుగురోజులు తిరుపతి వెళ్ళారు. అది నవంబరు నెల. కొండమీద చలి బాగా ఉంది. తెల్లవారుఝామున చలి కొంచెమెక్కువకాగానే దుప్పట్లు కప్పుతున్నారు కాటేజీల్లో జనం.

అప్పుడే మెలకువ వచ్చిన యశోద పక్కమీదినుంచి లేచి, గ్లాసెడు మంచి నీళ్ళు త్రాగి, తిరిగి పడుకోబోతూ, ఆ సన్నటి దీపపు వెలుగులో సాకేతరామ్‌ను ఓరగంట చూసింది.

నలుపుకంటే తెలుపే ఎక్కువగా ఉన్న తలవెంట్రుకలు చెదరిపోయి ఉన్నాయి. బక్కపలచగా ఉంటాడు కనుక వయసు ముఖమ్మీద కొట్టవచ్చినట్టుగా లేదు. ఆరోగ్యం కాపాడుకోవాలని సాయంత్రపు వేళల్లో ఒక మైలు దూరం నడుస్తాడు. ఆహారంలో మార్పు చెయ్యాలని రాత్రిపూట చపాతీ తింటున్నాడు.

చల్లటిగాలి రివ్వున వచ్చి చెంపమీద కొట్టినట్లయింది. యశోద దిగ్గునలేచి కాళ్ళదగ్గరగా మడత చేసిన శాలువ తీసి అతడికి కప్పింది.

దూరాన ఐదుగంటలు కొట్టినట్లు అనిపించింది. అది గంటలు కొట్టడంకాదు. జనసందడి. కొందరు అప్పుడే సుప్రభాతం వినటానికి వెళ్ళారు. కొందరు వెళ్తున్నారు.

యశోద గబగబా లేచి పళ్ళు తోముకుని స్నానంచేసి ఆయనకు ఐదున్నరకే కాఫీ తాగే అలవాటు కదా అని ఊరినుంచి తెచ్చిన స్టౌమీద నీళ్ళు కాచి కాఫీ డికాక్షను చేసింది శాలువ కప్పుకుని వాకిటి ముందర పాలకోసం కూర్చుంది.

సాకేతరామ్ లేచాడు. స్నానం చేశాడు. ఇంత కాలంనుంచీ తనకు వేకువ జామున లేచి వేడి వేడి కాఫీ ఇచ్చిన యశోదకు తెల్లవారకుండానే కాఫీ తీసుకువద్దామని పెరటివారిన ఫ్లాస్కు తీసుకుని హోటల్లో చేస్తూ చేస్తూన్న కాఫీని ఫ్లాస్కు నిండా నింపి తీసుకువచ్చాడు.

అప్పటికి యశోద వాకిట్లోకి వచ్చిన పాలు కొని కాఫీ కలిపి అతడి కోసం ఎదురుచూస్తోంది.

''మీకు బెడ్‌కాఫీ తాగే అలవాటు కదా అని, పాలు కొని కాఫీ చేశాను. ఎక్కడికి వెళ్లారు?'' అడిగింది యశోద, అతడి చేతిలో ఉన్న ఫ్లాస్కు చూడకుండానే.

''నీకూ కాఫీ వేళగా? అందుకని ఫ్లాస్కులో కాఫీ పోయించుకు వచ్చాను'' అన్నాడు ఫ్లాస్కు ఆమె చేతికిస్తూ.

కాఫీ తాగుతూ సాకేతరామ్ సింహావలోకనం చేసుకుంటున్నాడు 'ప్రేమలో స్నేహం ఎన్నిపాళ్ళు కలిసింది?'

మళ్ళీ అనుకుంటాడు సమాధానంగా ''65-70 సంవత్సరాలకు ఇంకా చాలా టైముందిగా? అంతవరకూ పరిస్థితి మెరుగవుతుంది. నేను ఇంప్రూవ్ అవుతాను'' అని.

'పిల్లలకు రెక్కలు వచ్చాయి. దూరాన ఉన్నారు. ఇప్పుడు తామిద్దరే మిగిలారు. రజతోత్సవం తరువాతనైనా నిజమైన జీవితంలో ప్రవేశించాలి. ఇద్దరూ మరింత సన్నిహితం కావాలి. ప్రేమలోనుంచి పుట్టే స్నేహాన్ని వృద్ధిచేయాలి.

ఎంతయినా యశోద ఆడది. బిడియపడుతుంది. తనే ముందడుగు వేయాలి. యశోద చెయ్యి పట్టుకుని జీవితంలో సాగిపోవాలి'' అనుకుంటాడు

సాకేతరామ్ సర్వీసు అయిపోవచ్చింది. తరువాత ఎక్కడ ఉండాలన్న ఆలోచన వస్తోందతనికి. ఇప్పుడు ఈ ఉన్న ఇంట్లో ఏవో మామూలు సౌకర్యాలే గాని ఆధునిక సౌకర్యాలేమీ లేవు. సమష్టి కుటుంబంలో ఉండగా యశోద బావిదగ్గర అంట్లన్నీ తోమేది. ఆ బావికీ ఇంటికీ మధ్య ఎంతో దూరం ఉండేది. అంట్లుతోమి పెద్ద బుట్టలో పెట్టుకుని రెండుసార్లు తిరిగేది. బట్టలూ అంతే. ఈ బట్టలన్నీ గంపలో పెట్టుకుని ఒక బకెటు ఒక సబ్బు బిళ్ళ తీసుకువెళ్ళేది. అన్నం తినగానే ఈ బట్ట లన్నీ ఉతికి ఎండపోకముందు ఆరవేసేది. ఇంటికి కావలసిన నీళ్ళన్నీ తోడిపోసేది.

ఒక్కతే ఇంత పని జేసేది.

అప్పుడు తనకేమనిపించలేదు. కాని ఇప్పుడు యశోదకు అటువంటి కష్టాలు కలిగించలేడు. సాధ్యమైనన్ని సౌకర్యాలు ఆమెకు అనుకూలమైనట్టుగా కలిగించ వలసిందే. ఎప్పుడో రామానాయుడు పేటలో అర ఎకరం స్థలంలో ఒక పెద్ద పెంకుటిల్లు-చుట్టూ సరకూచెట్లూ ఉన్నది వేలంలో చవుకగా కొన్నాడు. ఆ యిల్లు బాగుచేయించి అద్దెకిచ్చాడు. ఇప్పు డతడి కా ఊరు నచ్చలేదు. తన కొడుకులు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళకూ జీతాలూ బాగానే ఉన్నాయి. ఇప్పుడెవరూ తనమీద ఆధారపడినవారు లేరు. బాగా ఆలోచించి రెండురోజులు శెలవు తీసుకుని అక్కడికి వెళ్ళి ఆ యిల్లు అమ్ముతానని అందరికీ ధర కూడా చెప్పాడు. కొనదలచిన వాళ్ళను తన దగ్గరికి రమ్మన్నాడు.

ఆ యిల్లు ఆ ఊరికి ఘనమైనది. వెంటనే నలుగురు వచ్చారు. పోటీల మీద ఇల్లు మరో పదివేలకు అధికంగా అమ్ముడుపోయింది.

సాకేతరామ్ బంజారాహిల్సుకు దగ్గరగా ఒక చిన్న యింటికి సరిపడా స్థలం కొని చిన్న యిల్లు కట్టాడు. యశోదకూ తనకూ వృద్ధాప్యంలో ఏ విధమైన కష్టమూ కలగకుండా సకల సదుపాయాలూ చేశాడు. నీళ్ళగదీ వంట యిల్లూ అత్యంతాధు నికంగా కట్టాడు. వేడి నీళ్ళకు గీజరు పెట్టాడు. వంట యింట్లోకూడా ఒక చిన్నది పెట్టాడు. వంగక్కర లేకుండా అన్ని సదుపాయాలూ చేశాడు. ఇంటి వెనకాల చిన్న చిన్న చెట్లపాదులూ టాంకులో మంచి వాటికి కాలువలూ ఏర్పాటు చేశాడు.

ముందు ఇంటికి అందాన్నిచ్చే పూలచెట్లూ వాటికి నీటి వసతులూ చేశాడు. ఒక పక్కగా ఒక చిన్న పచ్చిక లానువేశాడు.

ఇల్లు చిన్నదయినా అలంకారాలు ఎక్కువగా చేశాడు పెద్దతనానికి పరిసరాలన్నీ కంటికింపుగా సంతోషం కలిగించాలని తపన

గృహప్రవేశానికి కొడుకులంతా వచ్చారు. కూతురు వచ్చింది. కొత్త యిల్లు చూసి కొడుకులకు మనసులో ముల్లు గుచ్చినట్లయింది.

నాలుగు రోజులయింది. తల్లీ తండ్రీ కలిసి ఇంటి పనులన్నీ చేస్తున్నారు. తల్లి చేసిన కాఫీ తండ్రి పిల్లలను పిలిచి ఇస్తున్నాడు. మధ్యాహ్నం వాళ్ళు పడుకుని లేచేటప్పటికి బట్టలుతికి ఎండవేస్తున్నారు. రిటైరయిన తరువాత సాకేతరామ్ పెరట్లో కాసిన కూరలు కోసుకువచ్చి తరిగి పెడుతున్నాడు.

ఇద్దరూ ఏవేవో సంఘటనలు జ్ఞాపకానికి తెచ్చుకుంటూ మాట్లాడి నవ్వుకుంటారు. చిన్ననాటి సంగతులన్నీ నెమరుకు తెచ్చుకుంటారు మురిపెంగా.

ఆ నాటి నవ్వులలో ముఖ్యమైనది కూరలు తెచ్చేటప్పుడు కొత్తిమీరి కరే పాకు కడిగి తీసుకురాలేదని. నేను తెస్తానంటే నేను తెస్తానని పోటీలుపడి పరుగులు తీశారు పెరట్లోకి.

వాళ్ళిద్దరినీ చూసిన కొడుకులు "వాళ్ళ గోలే వాళ్ళదిగాని అంతంత దూరాల నుంచి వచ్చిన మన సంగతులేమీ అడగరేం అమ్మా! నాన్నా?" అనుకోవటం మొదలుపెట్టారు. వాళ్ళ నవ్వులు, కబుర్లూ కొంచెం వెగటుగా తోచాయి.

"నాన్నా! ఇల్లు ఇంత చిన్నది కట్టావేమిటి? మీ యిద్దరికి తప్ప మూడో మనిషి వస్తే ఇబ్బందే" అన్నాడు పెద్ద కొడుకు.

"అవునురా! మాకు పెద్దతనం వస్తోందా? ఎక్కువ కష్టపడకుండా ఇంటి పనులు జరిగేటట్లుగా ఆధునిక సౌకర్యాలన్నీ పెట్టించాను. వృద్ధాప్యంలో సుఖంగా హాయిగా బ్రతక్కుండా ఏం కర్మమొచ్చిందని. వీలైనన్ని నదుపాయాలు పెట్టించాను. చూడు అక్కడ రికార్డు ప్లేయరు, దాని పక్కన రేడియో – చిన్న టి. వి. అన్నీ గోడల్లోనే అమర్చాను. ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ చెరొక పని చేసుకుంటూ ఉంటే మాకు రోజులు ఆనందంగా ఇట్టే గడుస్తాయి," అన్నాడు.

గది గదికీ ఉన్న ఫాన్లనూ మొజైక్ ఫ్లోరింగునూ చూసి, "నాన్నా ఆ యిల్లమ్మిన డబ్బంతా ఈ చిన్న ఇంటిమీద ఖర్చుచేశావన్న మాట." అన్నాడు శాస్త్రి బాధగా

"అవునురా. సుఖపడాల్సింది ముసలితనంలో" అన్నాడు సాకేతరామ్ మామూలుగా

వచ్చినప్పటినుంచీ తన పురిటికి అత్తగారిని రమ్మనమని అడగాలని మూడో కోడలు ప్లాను వేస్తున్నది. భోజనాల వేళ అడగనే అడిగింది.

జవాబు చెప్పటానికి కొంతసేపు ఆలోచించింది యశోద. తన ప్రాణ స్నేహితుణ్ణి విడిచి ఇప్పుడు తానెక్కడికీ వెళ్ళలేదు. తోడూనీడగా బ్రతుకుతున్న ఇద్దరూ విడి విడిగా పదిరోజులయినా ఉండలేరు. కాని ఈ మాట అనలేకపోతోంది

"ఒరే అబ్బాయీ! యశోద ఇంతకాలం చాకిరీ చేసిచేసి అలసిపోయిందిరా. ఇంక ఆమెను కష్టపెట్టటం నా కిష్టంలేదు. ఎలాగో మీరే సర్దుకోండి," అన్నాడు సాకేతరామ్. అతడి ముఖంలో అప్పుడే ఆవేదన ప్రారంభమైంది యశోద ఎక్కడ ఒప్పుకుంటుందోనని.

"అయితే మాకు మీ ఆశ లేదన్నమాట. చూడండి ఎంతమంది అత్తగార్లు కోడళ్ళకు పురుళ్లు పోస్తున్నారో?" అన్నాడు కినుకతో.

"ఈ ఆశే కాదురా. ఎటువంటి ఆశా లేదు. ఆ పాత ఇల్లు ఉంటే నలుగురం ఇళ్ళు కట్టుకునేవాళ్ళం కదా. అలా కాకుండా అంత ఇల్లూ అంత దొడ్డీ అమ్మేసి ఈ చిన్న యిల్లు కట్టి ఆధునిక సౌకర్యాలంటూ బోలెడు డబ్బు తగలబెట్టాడు. పెన్షన్ డబ్బు నెల నెలా వాడుకుంటారు. గ్రాట్యుయిటీ విలాస యాత్రలకు ఖర్చు పెట్టుకుంటారు." అన్నాడు తండ్రి వంక చూడకుండా పెద్ద కొడుకు.

"నాన్నా ఇంకా కారు అమ్మలేదేం? అసలు నడుస్తోందా? ఎందుకదీ అమ్మి పారేయక?" అన్నాడు రెండోకొడుకు.

"మాకు తిరగటానికి అది చాల్లేరా? అమ్మకు కాళ్లు నొప్పులు. సాయంత్రం వేళల్లో అలా బైటికి కాస్త ఖులాసాగా వెళ్ళాలంటే కారు-ఏదో ఒకటి చేతిలో ఉండాలి" అన్నాడు సాకేతరామ్.

"నాన్నా-అమ్మా కొత్త యువజంటగా తయారయ్యారు. ఇద్దరిలో స్వార్థం బాగా పేరుకుపోయింది. మన సంగతి పట్టించుకునేలా లేరు. మనమే వాళ్ళదగ్గర ముసలివాళ్ళంగా ఉన్నాము" అన్నది కూతురు కొంచెం వెక్కిరింపుగా.

"అసలు ఇద్దరూ ఇక్కడ వేరే కాపురం ఎందుకు?"

"ఇది స్వార్థమూ కాదు. మేమిద్దరం తిరిగి చిన్నవాళ్ళమవటమూ కాదు. యశోద మీకు తల్లేకాని-మీరు పెద్దవాళ్ళయిన తరువాత మీమీ సంసారాలు నిర్వహించుకుంటారు. యశోద కష్టసుఖాలు గమనించే వ్యవధానం ఉండదు. ఇక నాసంగతి యశోద నా జీవిత సహచరి. నాకు తోడు-నీడ, నా ప్రాణస్నేహితురాలు యౌవనం దిగజారినా గుండెలోని అనురాగం స్నేహం తగ్గనవసరంలేదు. ముసలివాళ్లు ఎక్కడో అక్కడ పడి ఉండాలనీ-ఏ మూలనో కాలక్షేపం చెయ్యాలనీ అనుకోవటం పొరపాటు. వయసు పెరిగి వంట్లో బలం తగ్గినకొద్దీ ఎక్కువ సంతోషంగానూ ఉల్లాసంగానూ ఉండటానికి తగిన పరిస్థితులు కల్పించుకుని ఉంటే జీవితం తిరిగి చిగురించినట్టుగా హాయిగా గడిచిపోతుంది. మనసును ఉల్లాసపరిచే పరిస్థితులు లేకపోతే మృత్యువు మీది మీదికి వచ్చినట్టుంటుంది. ఏడుపు ముఖాలు పడతాయి. అంతేగాని మీరు మరో విధంగా అనుకోకండి. ఇలాగే ప్రతియేడూ వచ్చి మమ్మల్ని చూసిపోతూ ఉండండి" గుండె పొంగుతుండగా యశోదను క్రీగంట చూస్తూ పిల్లలను చుట్టూ కూర్చోబెట్టుకుని చెప్పాడు సాకేతరామ్.

(యువ - దీపావళి సంచిక)